క్లుప్తంగా

దేవరగట్టులో విశేష పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఘనంగా దత్త జయంతి



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ఆలూరు: పట్టణంలో ఉపాధ్యాయనగర్‌లో కొలువుదీరిన సాయిబాబ మందిరంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు యుగంధర్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాన్ని సందర్శించి సాయి పారాయణంలో పాల్గొన్నారు. అనంతరం పూజ కార్యక్రమాల్లో సతీ సమేతంగా పాల్గొన్న వారికి ఒడిబియ్యం పోశారు. దత్త జయంతి సందర్భంగా సాయిబాబను ఫల, పుష్పాలతో ప్రత్యేక అలంకరించారు. బాబాకు పంచామృతాభిషేకాలు, మహా మంగహారతి, కాగడ హారతినిచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు వెంకటేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున, వెంకటేశ్వర చౌదరి అన్నదానం చేశారు.

20న పెరవలిలో వేలాలు

మద్దికెర : మండలంలోని పెరవలిలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సంవత్సరం పాటు టెంకాయలు, తమలపాకులు అమ్ముకునేందుకు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సీల్డ్ కొటేషన్, బహిరంగ వేలం ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు దేవాలయ ఆవరణలో నిర్వహిస్తామని ఈఓ వీరయ్య ఆదివారం తెలిపారు. ఆసక్తి గల పాటదారులు రూ.50 వేలు ధరావత్తు చెల్లించి వేలాల్లో పాల్గొనాలని సూచించారు.

ఆర్థిక సాయం

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక రెవెన్యూ క్వార్టర్స్ సమీపంలో నివాసం ఉంటున్న చాకలి రంగస్వామి (33)అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న 2005 బ్యాచ్ మిత్రులు లక్ష్మన్న, గిరీష్, దూదేకొండ రంగస్వామి తదితరులు ఆదివారం మృతుడి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రంగస్వామి భార్యకు రూ.5వేలు అందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



సుకువాయి గ్రామం సాయిబాబ ఆలయం సమీపంలో వేలాడుతున్న తీగలు

హొళగుంద: సుకువాయి గ్రామం సాయిబాబ ఆలయ సమీపంలోని కాలనిలో నివాస గృహాలు వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఈ కాలనీకి ఆనుకుని పొలాలు ఉండటంతో కాలనీ వాసులతో పాటు పొలాలకు తిరిగే వారు ఆందోళన చెందుతున్నారు. చాలా కాలంగా విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని అర్థం కాని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. తీగలు కిందకు వేలాడుతూ గాలికి ఊగుతుండటంతో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు అటు వైపు వెళ్తే తగిలేలా ఉన్నాయి. వెంటనే తీగలను ఎత్తులో ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గంగమ్మకు పూజలు



ఆదోని టౌన్: గంగాభవానీ దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి అభిషేకాలతో పూజలు నిర్వహించారు. పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగింపు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరేష్, దుల్లయ్య, మున్సిపాల్ వీరేష్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చీడపీడలపై వేపాస్త్రం



వేప చెట్టుకు ఉన్న వేప కాయలు

- తెగుళ్ల నివారణ, దిగుబడిలో కీలకపాత్ర పోషిస్తున్న వేప
- వేపగింజలతో పంటలకు కషాయాల తయారీ
- వేప కషాయాల వాడకంతో తగ్గిన పెట్టుబడి

కొత్త ఒక వింత.. పాత ఒక రోత అనే నానుడికి చెల్లుచీటి పలికింది వేప. పురాతన కాలం నుంచి మన సంప్రదాయం, జీవితంలో వేపకు అత్యంత ముఖ్య స్థానముంది. వైద్యపరంగానే కాకుండా ఆధ్యాత్మికంగానూ స్థానమిచ్చారు మన పెద్దలు. అదే వేప ఇప్పుడు రైతుల పాలిట కామధేనువులా మారింది. విస్తృతంగా లభించే వేప ఉత్పత్తులతో చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవడమే కాకుండా నాణ్యమైన దిగుబడులు పెరగడానికి మూలకారణమవుతోంది.



చిన్నహ్యాటలో వేపాకు, వేపగింజలను కలిపి కషాయాన్ని తయారు చేస్తున్న రైతులు

హొళగుంద: ఆధునిక వ్యవసాయం పేరుతో దారిమళ్లిన అన్నదాతలు మళ్లీ సంప్రదాయ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. ముఖ్యంగా చీడపీడల నివారణ కోసం రసాయనిక పురుగుమందులు ఇష్టారీతిన వినియోగించడంతో తెగుళ్లు వాటికి అలవాటు పడి అదుపులోకి రాని స్థితికి చేరుకున్నాయి. అలాగే రసాయన మందుల వినియోగం పెరగడంతో దిగుబడులు విషతుల్యంగా మారి జనం అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీంతో వాస్తవాన్ని గ్రహించిన రైతన్నలు మన మూలాలను తెలుసుకొని నాటి నుంచి వినియోగంలో ఉన్న వేప చెట్టు ఉత్పత్తులను వినియోగించి విజయవంతంగా పంటలను తెగుళ్ల నుంచి రక్షించుకుంటున్నారు. అలాగే దిగుబడుల్లో నాణ్యత పెరగడంతో లాభాలు చూస్తున్నారు. దారి తప్పినప్పటికీ తమ నిర్ణయాలను సమీక్షించుకొని మళ్లీ సంప్రదాయ పద్ధతులను వినియోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

రసాయనిక ఎరువులు, మందులతో రైతన్న కుదేలు..

రసాయనిక ఎరువులు, క్రిమీ సంహారక మందులను వాడి రైతన్న కుదేలవుతున్నాడు. ఎట్టకేటలకు నిజం తెలుసుకొని వేపచెట్టు విభాగాల నుంచి తయారు చేసుకున్న ఉత్పత్తులను వాడుకోవడం వల్ల తక్కువ వ్యయంతో అధిక లాభాలు అర్జించేందుకు తోడ్పడుతోందని వ్యవసాయధికారులు చెబుతున్నారు. ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడే పద్ధతికి స్వస్తి పలికి, వేప గింజలతో తయారు చేసే కషాయాలను వాడితే రైతుకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.వేపగింజలు విరివిగా దొరికే సమయంలో ప్రతి రైతూ ఎక్కువ మొత్తంలో వేప గింజలను సేకరించి ఉంచుకోవాలని వీటి ద్వారా మందులు తయారు చేసుకోవడం వల్ల తక్కువ ఖర్చుతో పంటల సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుందని సూచిస్తున్నారు. వేప ఉత్పత్తులతో రైతే స్వయంగా పురుగులను చంపే మందులను తయారు చేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయవచ్చు. దాని కోసం వేప గింజలు బాగా ఉపయోగపడుతాయి.

వేపగింజల ద్రావణం..



వేపగింజలు బాగా ఎండిన తరువాత వాటిపై ఉన్న పొట్టును తీసేసి మొత్తగా రుబ్బి పిండి చేసుకోవాలి. ఇలా తయారు చేసుకున్న వేప పిండిని గుడ్డలో మూటకట్టి 10 లీటర్ల నీటిలో 12 గంటల పాటు నానబెట్టాలి. తరువాత మూటను బాగా పిండుతూ మధ్య మధ్యలో నీటిలో మూటను ముంచుకుంటూ కషాయాన్ని బయటకు తీసుకోవాలి. అలా తీసుకున్న ద్రావణాన్ని పలుచటి గుడ్డలో వడగట్టి అందులో 100 గ్రాముల సర్ఫ్ కానీ, అరకిలో కుంకుడుకాయ రసాన్ని కలుపుకొని వంద లీటర్ల నీటిలో కలిపి ఎకరా పంటపై పిచికారీ చేసుకోవాలి. వేపకషాయం వల్ల లద్దెపురుగులు, శనగపచ్చ, ఆకు ముడత, నామాల, రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చు. అన్ని పంటలపై ఈ ద్రావణాన్ని పిచికారీ చేసుకొని పురుగులను నిర్మూలించవచ్చు.

వేపపువ్వు ద్రావణం..

5 కిలోల వేప పువ్వును బాగా మెత్తగా పేస్టులా రుబ్బుకోవాలి. అలా వచ్చిన పేస్టును ఒక గుడ్డలో కట్టి బక్కెటు నీటిలో 4 గంటల పాటు నానబెట్టుకోవాలి. నానబెట్టి మూట నుంచి ద్రావణాన్ని సేకరించాలి. అలా సేకరించిన ద్రావణం పాలులా ఉంటుంది. ఈ ద్రావణంలో వంద గ్రాముల సర్ఫ్ కలుపుకొని మొక్కలపై పిచికారీ చేసుకుంటే మొక్కులకు బాగా అంటుకుంటుంది. వేపపువ్వు కషాయం అన్ని పురుగులపై ప్రభావం చూపుతుంది. దీని ఘటైన వాసన వల్ల కీటకాలు మొక్కల దగ్గరకు రాలేవు. ఆకులపై గుడ్లు పెట్టలేవు. ఒక వేళ గుడ్లు పెడితే వేప ఉత్పత్తుల వల్ల గుడ్లు నాశం చేసి కీటక సంతతి వృద్ధి కాకుండా చేస్తుంది. వేప సంబంధ ఉత్పత్తులను వాడుకోవడం వల్ల మొదటి దశలోనే పంటను ఆశించే పురుగులను నాశనం చేయడం ద్వారా పంటల సస్యరక్షణకు అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చు.

నీమ్ ఆయిల్..



వేప ఆకులు, వేప గింజలు, వేప పువ్వు ద్వారా తీసిన రసాన్ని శుద్ధి చేసి ఎక్కువ కాలం నిల్వ ఉండేలా మార్కెట్‌లలో నీమ్ ఆయిల్ అందుబాటులో ఉంది. నీమ్ ఆయిల్‌ను పైరు తొలిదశలో వాడుకోవడం వల్ల మొక్కలు చేదుగా మారడంతో పురుగులు మొక్కలను ఆశించవు. దీంతో తెగుళ్ల, పురుగులు త్వరగా దరిచేరవు. అంతే కాకుండా మొక్కకు వ్యాధి నిరోధక శక్తి పెరిగేందుకు దోహదపడుతుంది.

నీమాస్త్రం..



బాగా నూరిన 5 కిలోల వేపాకు ముద్దను కానీ, 5 కిలోల ఎండు ఆకులు లేదా 5 కిలోల వేప పండ్లు 100 లీటర్ల నీటిలో వేసుకొని 5 లీటర్ల గోమూత్రం, ఒక కిలో ఆవు పేడను వేసుకొని కర్రతో బాగా కలుపుకోవాలి. అలా కలిపిన మిశ్రమాన్ని 24 గంటల పాటు మూత పెట్టి నానబెట్టుకోవాలి. ఇలా నానబెట్టుకున్న ద్రావణాన్ని గుడ్డలో వడగట్టుకొని పంటలపై పిచికారీ చేసుకోవచ్చు. నీ మాస్త్రం పిచికారీ వల్ల రసం పీల్చే పురుగులు చిన్న దశలో ఉంటే వాటిని నిర్మూలించేందుకు దోహదపడుతుంది.

వేప పిట్టు లేదా వేప చెక్క..

వేప గింజల నుంచి రసాన్ని తీసిన తరువాత వచ్చే దాన్ని పిట్టు లేదా చెక్క అంటారు. దీన్ని గోతాముల్లో నిల్వ చేసుకొని పంటల సాగు చేసే సమయంలో పొలంలో ఆఖరి దుక్కులో ఎకరాకు 3 క్వింటాళ్ల చొప్పున వేసుకున్నట్లయితే నేలలోని శిలీంద్రాలు నశించి మొక్కలు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదపడుతుంది. ఇలా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వేప గింజలు, ఆకులు, పువ్వులతో తక్కువ ఖర్చుతో మందులను తయారు చేసుకోవడం వల్ల రైతుకు పంటపై పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.

సేంద్రియ కాషాయాలతో మంచి దిగుబడి



నేనే 15 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నా. అందులో వేరుశనగ, మిరప, జొన్న, పత్తి పంటలు సాగు చేశాను. ఈ పంటలకు ఎక్కువ శాతం వేపాకు, ఇతర ప్రకృతి పరంగా దొరికే ఆకులు, పేడ తదితర వాటితో తయారు చేసిన ద్రావణాలు, కషాయాలు తయారు చేసుకొని వాడతాను. వాటివల్ల తెగుళ్ల రావడం లేదు. దీంతో పంటల దిగుబడి బాగానే వస్తున్నాయి. సేంద్రియ ఎరువులు, మందులు వాడడం వల్ల కల్తీలేని పంటలను తీసుకోవచ్చు. ఖర్చు తక్కువ, మంచి దిగుబడి, ఆరోగ్యం భద్రంగా ఉంటుంది.

– కుమ్మరి వీరేష్, రైతు, చిన్నహ్యాట

ఖర్చుతక్కువ.. నాణ్యమైన దిగుబడి సాధ్యం



ప్రకృతిలో విస్తృతంగా దొరికే వేప ఉత్పత్తులతో కషాయాలు, ద్రావణాలు, వేప నూనె తయారు చేసుకొని పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు ఆశించవు. వాటిని ముందస్తుగానే నివారించుకోవచ్చు. కషాయాల తయారీకి ఖర్చు కూడా ఉండదు. రసాయనిక మందులు పిచికారీతో ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయి. నేల సారం కోల్పోతుంది. కొన్నేళ్లకు తెగుళ్లకు మందులను తట్టుకునే శక్తి వస్తుంది. దీంతో మరింత అధికంగా వినియోగించాల్సి వస్తోంది. వీటికి విరుగుడుగా వేప అద్భుతంగా పనిచేస్తుంది. రైతులు పంటల సాగులో వేప వినియోగాన్ని పెంచాలి.

– ఆనంద్ లోకదశ్, వ్యవసాయాధికారి, హొళగుంద

ప్లాస్టిక్ కవర్లపై నిషేధమేది?

- మార్కెట్‌లో విచ్చలవిడిగా వినియోగం
- నియంత్రణ చర్యలు శూన్యం
- పంచాయతీ చెత్తలో సగం ప్లాస్టిక్ వ్యర్థాలే



ఆలూరులోని చెత్తకుప్పల్లో అధిక శాతం ప్లాస్టిక్ కవర్లే

ఆలూరు రూరల్: ప్లాస్టిక్ వ్యర్థాలు పట్టణాలను, గ్రామాలను పట్టి పీడిస్తున్నాయి. చెత్త కుప్పలు మొదలు డ్రైనేజీ కాలువల వరకు ఎక్కడ చూసినా వాటి వ్యర్థాలే కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిబంధనలకు పాతర వేయడంతో ప్రమాద తీవ్రత నానాటికీ పెరిగిపోతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం స్పందించడం లేదు. ఓ వైపు ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరుగుతుండడంతో అధికారులు అవగాహన కల్పించడం లేదు. మరోవైపు వాటిని రీసైక్లింగ్ చేసే యంత్రాలు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది.

నిబంధనలు..

సాధారణంగా 40 మైక్రాన్ల మందమున్న ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వాడాలనే నిబంధన ఉండేది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2016లో 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్ల తయారీ, వాడకంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆస్పత్రుల్లో విడుదలవుతున్న బయోవ్యర్థాలపై కూడా ఆంక్షలు విధించింది. అయితే ఆ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

నియంత్రణ చర్యలు శూన్యం..

ఇటీవల కాలంలో 20 మైక్రాన్ల మందం మాత్రమే ఉన్న ప్లాస్టిక్ కవర్ల వాడకం అందుబాటులో వచ్చాయి. చికెన్ షాపులు, టీ,టిఫిన్ హోటళ్లు, తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయిస్తున్నారు. టీ స్టాళ్లలో వేడి వేడి టీ కూడా ఇలాంటి కవర్లలోనే పార్శిల్ చేసి ఇస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కవర్ల నిషేధంపై అవగాహన కల్పించి విక్రయదారులు, షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసిన పదార్థాలను భుజిస్తే క్యాన్సర్ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఇది ఎక్కువగా పిల్లలు,వృద్ధులపై ప్రభావం చూపుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గిస్తే ప్రాణాలకు ముప్పు తొలగడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడినట్లవుతుంది. ఇప్పటికే కాలుష్యం కారణంగా రుతుపవనాలు గతి తప్పాయి. కొత్త కొత్త వ్యాధులు బయటపడుతున్నాయి. ముఖ్యంగా ప్రమాదకర వ్యాధులు మొండి వ్యాధులుగా మారతాయి. ప్రమాదస్థాయి పెరుగుతుంది. 20మైక్రాన్ల మందమున్న కవర్లలో ఆహార పదార్థాలు పార్శిల్ చేయరాదు.

– వాహిద్, డాక్టర్, ఆలూరు

చారిత్రక సాక్ష్యం..శిథిలం

- కూలిపోయే దశలో ములుగుందం పోలీస్ ఔట్ పోస్టు
- 8 ఏళ్లుగా సిబ్బందిలేని ఔట్ పోస్టు
- 159 ఏళ్ల కిత్రం నిర్మించిన బ్రిటిష్ పాలకులు



శిథిలావస్థకు చేరుకున్న ములుగుందం పోలీస్ ఔట్ పోస్టు

ఆస్పరి: మండలంలోని ములుగుందం పోలీస్ ఔట్ పోస్టు శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఔట్ పోస్టు నిర్మించి 159 ఏళ్ల కావస్తున్నందున ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. 1865లో బ్రిటిష్ వారు నేరాలను అరికట్టేందుకు మండలంలోని ములుగుందంలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేసి, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఔట్ పోస్టు దగ్గరే 8 సెంట్లు భూమిని కూడా కేటాయించారు. వారి పాలనలో ములుగుందం చుట్టు పక్కల ఉన్న కారుమంచి, అగ్రహారం, డి.కోటకొండ, పలకూరబండ, వెంగళాయిదొడ్డి, కైరుప్పల, చెన్నంపల్లి, పుప్పాలదొడ్డి, బైలుపత్తికొండ, బనవనూరు, గార్లపెంట గ్రామాలు ఈ ఔట్ పోస్టు పరిధిలోకి వచ్చేవి. అప్పట్లో దేవనకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ములుగుందం గ్రామం 1987లో మండలాలు ఏర్పాటైన తరువాత ఆస్పరి మండల పరిధిలోకి వచ్చింది. ఈ ఔట్ పోస్టులో ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే 8 ఏళ్లుగా ఈ ఔట్ పోస్టుకు సిబ్బంది కేటాయించలేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అలనాపాలనా లేక భవనం శిథిలావస్థకు చేరుకుంది. ములుగుందం నుంచి ఆస్పరి పోలీస్ స్టేషన్‌కు రావాలంటే 30 కి.మీ. దూరం ఉంది. ములుగుందంలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయడం వల్ల చుట్టు పక్కల గ్రామాల వారికి అనుకూలంగా ఉంటుందని పలకూరబండ, కారుమంచి, డి.కోటకొండ, బనవనూరు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆస్పరి పోలీస్ స్టేషన్‌లో సీఐతో పాటు ఒక ఎస్ఐ, ముగ్గురు ఏఎస్ఐలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు కలిసి మొత్తం 29 మంది ఉండాలి. ప్రస్తుతం సీఐ, ఎస్ఐ, ఒక ఏఎస్ఐ, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 14 మంది కానిస్టేబుళ్లు కలిసి మొత్తం 20 మంది ఉన్నారు. ఇంకా 9 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. పోలీస్ ఔట్ పోస్టు భవనాన్ని పునర్నిర్మించి సిబ్బందిని కేటాయించాలని ములుగుందంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బంది కొరత కారణంగా ములుగుందం పోలీస్ ఔట్ పోస్టుకు సిబ్బందిని నియమించలేక పోతున్నామని, సిబ్బందిని కేటాయిస్తే నియమిస్తామని చెప్పారు.

అమరజీవి మహనీయుడు



ఆలూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పంచాయతి సిబ్బంది



ఆలూరులో ఊరేగింపు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



ఆస్పరిలో కన్యకాపరమేశ్వరీ, పొట్టి శ్రీరాముల చిత్ర పటాలను ఊరేగిస్తున్న దృశ్యం



పత్తికొండలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వెల్దుర్తిలోని మొయిన్‌బజార్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ఆలూరు రూరల్: ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ప్రాణాలర్పించిన పొట్టిశ్రీరాములు మహనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ ఆఫీసుల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి సిబ్బంది నివాళులర్పించారు. అమరజీవి వర్ధంతి పురస్కరించుకుని పట్టణంలో ఆర్యవైశ్యులు శ్రీరాములు చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అనితర సాధ్యమన్నారు.

ఆస్పరి: అమర జీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఆస్పరిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు ర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం కన్యకాపరమేశ్వరీరి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, తిమ్మన్న, వెంకటరాముడు, సుధాకర్, పవన్, సుబ్రహ్మణ్యం, రవి, సూరయ్య, మణికంఠ పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఆదర్శనీయమని ఎంపీపీ నారాయణదాసు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, మారెల్ల సింగివిండో మాజీ అధ్యక్షులు అట్ల గోపాల్‌రెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరజీవి త్యాగఫలం కారణంగానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయక మన్నారు. దేవన్న, షరీఫ్, పీరా, మోహన్ పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని సర్పంచ్ కొమ్ము దీపిక, ఆర్యవైశ్య సంఘం నాయకులు రమేష్, మధుబాబు అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని నాలుగు స్తంభాల కూడలిలో మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ, టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

మద్దికెర : పొట్టిశ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారని సర్పంచ్ సుహాసిని, ఈవో శివకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, ఆంజనేయులు సచివాలయ సిబ్బంది గోవిందరాజులు, శిరీష పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మరువలేనిదని ఆర్యవైశ్య సంఘం నాయకులు సముద్రాల శ్రీరాములు, ఒంగోలు సాయిప్రసాద్ అన్నారు. వెల్దుర్తిలోని మొయిన్‌బజార్‌లో ఆదివారం వారు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అత్తులూరు కృష్ణ కిరణ్, వేములు శేషు, చాటకొండ కార్తీక్‌కుమార్, ప్రసాద్, జ్ఞానేశ్వర, శ్రీకాంత్, అభినవ్, చిన్ని శ్రీనివాసులు, రాజేష్, మారుతి పాల్గొన్నారు.



తిరునాలలో అమ్మకానికి ఉంచిన వృషభాల అలంకరణ వస్తువులు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

వైభవం.. మునిరంగస్వామి ఉత్సవం



తిమ్మగురుస్వామి తేరు పూజకు వెళ్తున్న భక్తులు



విశేష అలంకరణలో మునిరంగస్వామి

తుగ్గలి : లింగనేనిదొడ్డి సమీపంలోని కొండపై వెలసిన మునిరంగస్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. నంద్యాల పక్కీరప్పతాతయ్య పీఠాధిపతి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఆలయ పూజారి కృష్ణారెడ్డి స్వాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. చివరి రోజు తిమ్మగురుస్వామి, శ్రీదేవి భూదేవి సమేత మునిరంగస్వామి ఉత్సవమూర్తులను గ్రామం నుంచి కొండపైకి మేళ తాళాలతో తీసుకెళ్లారు. హోమాలు, ప్రత్యేక పూజలు అనంతరం తిమ్మగురుస్వామి రథోత్సవాన్ని చేపట్టారు. స్వామి కల్యాణం, సాయంత్రం మునిరంగస్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తజనులు తరలివచ్చారు.జనసందోహం మధ్య రథోత్సవం వేడుకగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీఠాధిపతి శ్రీనివాసులు ఆశీర్వాదం తీసుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు. తిరునాల సందర్భంగా మిఠాయి, బొమ్మల దుకాణాలు, ఎద్దుల అలంకరణ వస్తువులు వెలిశాయి. వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ నాగేంద్ర ప్రారంభించారు. తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.